## కథ

# పీత కష్టాలు పీతవి- పిల్లల కష్టాలు పిల్లలవి

**వీపుమీది బరువులు మోసుకుంటూ రోడ్డుకి ఓ పక్కగా నడుస్తున్నాడు ఎనిమిదేళ్ళ 'వాడు'. ఆ రోడ్డు మీద మనుషులతో సహా ప్రతి ప్రాణీ స్వేచ్ఛగా ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్ళు దేని ఇష్టం వచ్చినట్టు అది హాయిగా, ఆనందంగా ఉన్నట్టనిపించింది 'వాడికి'. ఓ రెండు కుక్కలు తనివితీరా అరుచుకుంటూ అర్జెంటు పనున్నట్టు స్పీడుగా పరిగెత్తి ఎటో పోతున్నాయి. కాకులు, పిచ్చుకలూ సరేసరి.**

టీచరు లేని క్లాసులో పిల్లల్లాగా గొప్ప అల్లరి చేసి పారేస్తున్నాయి. గుంపులుగా పోతున్న ఆవులూ గేదెలూ కూడా అంతే. వాటి వెనకాలే చిన్నకర్రతో గెంతుకుంటూపోతున్న పోలిగాడి సంగతి చెప్పక్ఖర్లేదు. రోడ్డంతా వాడి తాత సొమ్ములా నడుస్తూ అటూ ఇటూ పోతున్న స్కూటర్లమీద చేతిలో కర్రతో ఒక్కటిచ్చుకుంటున్నాడు.

'ఇలా అందరూ ఎవరిష్టం వచ్చినట్టు వాళ్ళు హాయిగా ఆనందంగా ఉంటే నాకు మటుకే ఈ గాడిద బరువెందుకో!' అనుకున్నాడు 'వాడు'. అలా అనుకోగానే 'వాడి' కళ్ళు రోజూ ఆ దారంటా వెళ్ళే గాడిద కోసం వెతికాయి. అది గుడి గోడకానుకుని నిలబడే నిద్రపోతోంది. 'ఆఖరికి గాడిదక్కూడా గాడిద బరువు లేదు. నాకు మాత్రం తప్పదు'. దుఃఖంతో 'వాడి' గుండె బరువెక్కిపోయింది. రోడ్డు పక్కన పెట్టున్న డొక్కుస్కూటరు వెనకనుంచి చేతిలో పొడుగాటి స్క్రూడ్రైవరుతో పదేళ్ల రంగడు ప్రత్యక్షమయ్యాడు. కుడికాలితో రెండుస్టెప్పులూ ఎడంకాలితో రెండు స్టెప్పులూ లయబద్ధంగా స్కూటరు చుట్టూ కుంటి గంతులేస్తూ చేతిలో స్క్రూడ్రైవరుని కత్తిలా ఝుళిపిస్తూ 'వాడి' కేసి చూసి నవ్వాడు. రంగడి తాండవం ధాటికి దడదడలాడి స్కూటరు ధడేల్న పడింది. లోపల్నించి ''అరేయ్ రంగిగా!'' అన్న గర్జన తాలూకు శబ్ద తరంగాలు ఇవతలకొచ్చేలోగా రంగడు కాంతివేగంతో దూసుకుపోయి రోడ్డుపక్క దీపస్థంభం దగ్గర గొంతుక్కూచున్నాడు. నల్లమేఘంలాంటి మెకానిక్ మస్తాన్రావు బయటికొచ్చి అటూ ఇటూ చూసాడు. అప్పుడే ప్రకృతి పిలిచిన పిలుపునకు సరైన జవాబిచ్చి వస్తున్నట్టు నెమ్మదిగా లేచి జార్చిన నిక్కరు లాక్కుంటూ ఆ స్కూటరు అధోపతనానికీ తనకూ ఏమీ సంబంధం లేదన్నట్టు అమాయకపు చూపులు చూసాడు రంగడు. ''గాలికే పడిపోనాదేట్రా యదవ స్కూటరు?'' అన్న మస్తాన్రావు ప్రశ్నకి అవునన్నట్టుగా చాలా గౌరవంగా తలూపాడు రంగడు.

''సర్లే. పుల్లమ్మత్త దగ్గరకెళ్లి నాలుగు పుల్లట్లు పార్సిలు పొట్లం కట్టించుకురా. డబ్బులు నేనొచ్చిత్తానన్నానని సెప్పు'' అన్నాడు. రంగడు అమాయక మొహం మార్చి దీనం మొహం పెట్టాడు. ''నువ్వూ ఓ రెండట్లేపిచ్చుకు తిను'' మస్తాన్ మాట పూర్తిగా నోట్లోంచి ఇంకా బయటికి రానే లేదు రంగడు ఇక్కడ మాయమై అక్కడ ప్రత్యక్షమయ్యాడు.

'వాడు' కూడా తన వీప్మీది భారం మోసుకుంటూ కాళ్ళీడ్చుకుంటూ వీధి చివరి మలుపు దగ్గరి పుల్లమ్మత్త టిపినీ బండీ దగ్గరికి చేరాడు. 'వాడె' లాగూ ఆ దారివెంటే వెళ్ళాలి. అక్కడ పుల్లమ్మత్త బండిమీద స్టౌ పెట్టి పుల్లట్లు పోస్తూంటే ఆమె కూతురు ఏడేళ్ల ఎంకటి పక్కనే గ్లాసులూ పళ్ళాలూ కడిగి చిన్న చెక్క పీటమీద బోర్లిస్తోంది. రంగడు ఆ పక్కనే ఓ రాయి మీద కూచుని స్క్రూడ్రైవరుతో గ్లాసుల మీద జలతరంగిణి వాయించేస్తున్నాడు. ''న్నక్కు న్నిక్కు న్నొక్కొయ్య'' అని ఏదో పాట నోటికొచ్చినట్టు పాడేస్తోంది ఎంకటి.

''ఓరి రంగొరేయ్! గిలాసులు సొట్టడిపోతాయి రొరేయ్'' పుల్లమ్మ అరుపు కూడా ఆ జుగల్ బందీ కళాకారుల గానంలో కలిసిపోయింది. షో ఎంజాయ్ చేస్తూ నుంచున్నాడు 'వాడు'.

''నీక్కూడా. ఓ రెండట్లేసి పెట్టనా?'' ముద్దుగా బుగ్గ రాస్తూ అడిగింది పుల్లమ్మ.

''ఒక్కటి చాలు'' చెప్పాడు 'వాడు'.

వేడి అట్టు ఊదుకుంటూ తింటున్న 'వాడిని' ''పొద్దున్నేం టిఫినీ తిన్నావింటికాడ?'' అడిగింది. వాడు ఆలోచించాడు. ''పపు...పావు..పావుషుటి కాహారం'' అన్నాడు 'వాడు'. నోటినిండా దోసె ముక్కతో 'వాడు' చెప్పిందేవిటో తెలీక ''ఏటో! మీయమ్మ ఆ ఇంగిలీషు టిపినీలు చచ్చీచెడీ చేసి పెడద్ది. అయి మన తెలుగోల్లకి వొంటబడతాయా ఏటీ? మన దోసెలూ ఇడ్లెన్లే నయ్యం. నువ్వు మాత్తరం ఎప్పుడు కావాలంటే అప్పుడీడకొచ్చి తింటూండు బాబూ ఆ గాడిద బరువు మొయ్యటాకైనా బలం కావాలా?'' 'వాడు' తింటున్నంతసేపూ కామెంటరీ లాగిస్తూనే ఉంది పుల్లమ్మ. 'వాడు' తిని చెయ్యి కడుక్కుని ''డబ్బులున్నాయ్ ఇచ్చేస్తా'' అంటూ జేబులో చెయ్యి పెట్టాడు. వీపు మీది బరువు భుజాలని విరగదీస్తుంటే చెయ్యి జేబులో అడుగుదాకా అందలేదు. ''పుల్లమ్మత్తా డబ్బులు నువ్వే తియ్యి'' అన్నాడు.

ఎంకి ఛెంగున లేచొచ్చి ''ఒద్దొద్దు మాయమ్మకి డబ్బులియ్యమాక. నువ్వింత పొడుగు సీకిలెట్టు తింటుంటావే అట్టాంటిది సాయింతరవొచ్చీ టప్పుడట్టుకురా'' అంది.

''సరే'' తలూపి ముందుకు నడిచాడు వాడు. నాలుగడుగులేసి మెయిన్ రోడ్డెక్కేసరికి గాంధీ విగ్రహం ఎదురు పడ్డాడు. అంటే గాంధీ విగ్రహం లాగా సిల్వర్ పెయింట్ పూసుకుని సెంటర్లో సిగ్నల్స్ దగ్గర అడుక్కునే కుర్రాడన్నమాట. ''ఇవాళ నువ్వు వేషం వెయ్యల్లేదా?'' అనడిగాడు 'వాడు' ఆ కుర్రాడిని. ''ఇయ్యాల సెంటర్లో మా అన్నయ్య డూటీ సేస్తన్నాడు. నేను సెర్చి కాడ కుంటోడి యాసం ఎయ్యాల రేపుదయం. చాయంతిరం రోములోరి గుడికాడ అదే ఏసం కట్టాల. అబ్బో శానాకట్టం! సరుకులు దెచ్చుకోవాల'' గాంధీ విగ్రహం చెప్పాడు హడావిడిగా నిలవలేనట్టు చిందులొత్తొక్కుతూ.

''సెర్చికాడ అంటే ఎక్కడ?'' 'వాడు' అడి

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది పోటీలో ఎంపికైన కథ**



గాడు.

''సెర్చి తెలవదా?'' అని ఈసడింపుగా చూసి గాంధీ విగ్రహం వెళ్ళి పోయాడు. 'వాడి'కి రోము లోరి గుడి అన్నా తెలియలేదు. ఏమయ్యుం టుందా అని ఆలోచిస్తూ నెమ్మదిగా నడక సాగిం చాడు. నడిచి నడిచి ఓ పెద్ద గేటు ముందు ఆగాడు. ఆ గేటు దగ్గరున్న వాచ్‌మెన్ ''ఇంక గేటెసె య్యాల బేగి లగెత్తు'' అంటూ తొందర పెట్టాడు. 'వాడు' చేతనైనంత వేగంగా అడుగులేస్తూ లోపలికి ప్రవేశించాడు. వీపుమీది బరువు దింపుకునే టైము లేక దానితోపాటు వెళ్ళి లైనులో నుంచున్నాడు. ప్రార్థన మొదలయింది. ప్రిన్స్‌పాల్ మేడమ్‌గారి నీతుల దండకంతో పూర్తయింది.

పిల్లలందరూ పరమసైలెంటుగా క్లాసుల్లోకి లైన్లు తప్పకుండా వెళ్ళి కూచున్నారు. 'వాడు' కూడా క్లాసులోకెళ్ళి ఒక సీటు దగ్గర బరువు దింపాడు. వంకరగా బిగుసుకుపోయిన వీపు నిటారుగా నిలబ డలేక తడబడింది. జాగ్రఫీ టీచర్ లోపలికి ఠీవిగా నడుచుకొచ్చారు. పిల్లలందరూ ''గుడ్‌మార్నింగ్ టీచర్'' అని ముక్త కంఠంతో అరుస్తూ లేచి నిలబ డ్డారు. టీచరుగారు చకచకా ఎటెండెన్స్ తీసుకుని, ''శ్రీరామ్!'' అని స్టైలుగా కేకేట్టారు.

'వాడు' ఉలిక్కిపడ్డాడు. ఎందుకంటే 'వాడి'పేరు 'శ్రీరామ్' కాబట్టి. టీచరుగారు అలా పెట్టిన ఆ ప్రత్యేకమైన కేకకి అర్థం వాడికి బాగా తెలుసు కాబట్టి ''ఎస్ టీచర్'' అన్నాడు శ్రీరామ్.

వాడనుకున్నట్టే ఉరుములేని పిడుగులా మీద పడనే పడింది. ప్యూను పోచమ్మ క్లాసులో ప్రవేశిం చింది.

**పోడూరి కృష్ణకుమారి**

బల్లమీద పొడుగ్గా చుట్టబడిన ఛార్ట్ పేపర్లు పెట్టి వెళ్ళింది. మన శ్రీరామ్ గుండె గుబగుబ లాడింది. ''శ్రీరామ్! కమాన్. లుక్ ఎట్ దిస్'' టీచరు ఛార్టు పేపరు విప్పారు. అది ఖాళీగా ఉంది. శ్రీరామ్ గుండెల్లో రాయి పడింది. మిగతా పిల్ల లందరూ దానికేసి వింతగా, సరదాగా చూసారు. వాళ్ళందరికీ మిన్ను విరిగి శ్రీరామ్ మీదనే పడిం దని ఖచ్చితంగా తెలుసు. ఎందుకంటే జాగ్రఫీలో క్లాసు మొత్తానికీ శ్రీరామే మొనగాడు. జాగ్రఫీ టీచరుగారి ప్రియశిష్యుడు. ''ఆ.. శ్రీరామ్ చూడూ నీకో చిన్న సరదా ఎసైన్‌మెంట్'' అంటూ మొదలుపెట్టి ఆ ఛార్ట్ మీద భారతదేశ పటం గీసి, అందులో రాష్ట్రాల ఆకారాలు గీసి, అవి కత్తిరించి వేరే పల్చటి చెక్కముక్కల మీద

అంటించి, దేశపటపు పజిల్ ఎలా చెయ్యాలో వివరించి, ఇంకో ఛార్ట్ తెరిచి, దానితో ఆసియా ఖండపు మ్యాపుపజిల్ ఎలా చెయ్యాలో వివరించి, ''హమ్మయ్య!'' అని అలుపు తీర్చుకోడానికి కుర్చీలో కూలబడింది. ఆవిడ మాటాడుతున్నంతసేపూ మొదటి రెండు వాక్యాలకూ ''ఎస్ టీచర్'' అని బుర్రూపి తరువాతి వాక్యాలన్నింటికీ డైలాగు లేకుండా కేవలం బుర్రూపే ఏక్షన్ మాత్రమే చేసిన శ్రీరామ్ చివరి వాక్యానికొచ్చేసరికి మెడకాయ నెప్పెట్టి ఇంక ఏక్షను కూడా మానేసి బిగుసుకుపోయాడు. అప్పుడు పడింది పిడుగు- ''శ్రీరామ్! శ్రీరామ్!'' అని ఉరుముకుంటూ, లెక్కల టీచర్ రూపంలో. పాపం మేథ్స్ టీచరుగారిక్కూడా శ్రీరామే ప్రియశిష్యుడు.

''లాస్ట్ ఇయర్ నీకు మేజిక్ స్క్వేర్స్‌తో పజిల్స్ తయారుచెయ్యడం నేర్పానుకదా? అలాంటివే ఇంకో రెండు రకాలు చెయ్యాలి శ్రీరామ్. నేర్పుతాను. సాయంత్రం స్టాఫ్ రూంకిరా.''

శ్రీరామ్‌కి నోట మాట రాలేదు. ఎందుకోగానీ గొంతులోంచి ఓ మూలుగు మాత్రం వెలువడింది.

''నెక్స్ట్ వీక్ మన స్కూల్ డే ఫంక్షనుంది కదా అప్పుడు ఎగ్జిబిషన్‌లో నువ్వు చేసే పజిల్సే హైలైట్. నీకు బెస్ట్ ప్రాజెక్ట్ ప్రైజ్ గ్యారంటీ''

టీచరుగార్లిద్దరూ జాయింటుగా చెప్పారు. ''మెటీరియలంతా స్కూల్లోనే ఇస్తాం'' అని వాగ్దానం కూడా చేసారు అక్కడికి వాడికేదో మహోపకారం చేస్తున్నట్టు. ఆ రోజు అలాగే రకరకాల ప్రాజెక్ట్ల రూపంలో మరో నలుగురు పిల్లల మీద పిడుగులు పడ్డాయి. ఆ పిల్లలకా సమయంలో ఎవరూ చెప్పకుండానే కర్మ సిద్ధాంతం బాగా విశదంగా తెలిసిపోయింది. ఆ సాయంత్రం స్కూలు పిల్లలందరూ ఇళ్ళకెళ్ళిపోయిన చాలా సేపటికి శ్రీరామ్, మరికొంతమంది పిల్లలు స్కూలు గేట్లోంచి రోడ్డుమీదకొచ్చి ఇంటి దారి పట్టారు. వాడిన ముఖం, చెదిరిన జుట్టు, మాసిన చొక్కా, కడుపులో ఆకలితో తీవ్రంగా ఆలోచిస్తూ కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్న శ్రీరామ్‌కి గాంధీ విగ్రహం కనిపించాడు. ఒంటికాల్తో కుంటడం ప్రాక్టీస్ చేసుకుంటూ ఎటో పోతున్నాడు వాడు. ''గాంధీ! గాంధీ!'' పిలిచాడు. విగ్రహం ఆగాడు. శ్రీరామ్‌ని ఎగాదిగా చూసాడు. ఒక చేతిలో చుట్టచుట్టిన ఛార్ట్ పేపర్ల గొట్టం. మరో చేతిలో రంగుల బాక్సులూ రంగుల పిన్నులూ కలిపి కట్టిన పెద్దపొట్లం. వీపుమీద బరువైన పుస్తకాల సంచీ, జీబూతంలా ఒళ్ళు, నీరసంగా కళ్ళు. చాలా విచిత్రంగా కనిపించాడు శ్రీరామ్.

''ఏటీ ఏసం?'' అన్నాడు విగ్రహం కిచకిచ నవ్వి.

''సెర్చంటే ఏంటి?'' అడిగాడు శ్రీరామ్.

''అబ్బా!'' తలకొట్టుకున్నాడు విగ్రహం, ''మీ ఇస్కూల్లో ఏటి సెప్తున్నారో! ఏటో!'' విసుక్కుని, ''సెర్చంటే ఏమపెబువుని పూజ్జేసుకుంతారే? ఆ గుడి'' చెప్పాడు. ఏమపెబువంటే తెలియలేదు శ్రీరామ్‌కి. అయినా వాడడగదల్చినదసలు ఈ సంగతులు కాదు. అటూ ఇటూ చూసి అసలు సంగతి అడిగేసాడు.

''నువ్వు వేషం కట్టి రోజుకెంత సంపాదిస్తావు?''

''ఓయబ్బో ఆ లెక్కలన్నీ కావాల్సొచ్చాయా? ఎవ్వరికీ సెప్పమాక రాంబాబూ! ఎంతంటే రోజుకో వందేసుకో! ఇంక పండగ రోజులైతే రోజుకి ఎయ్యి కూడా కళ్ళ చూస్తాం'' విగ్రహం చెప్పిన జవాబు విన్న శ్రీరామ్‌కి నోట మాట రాలేదు. విగ్రహం వెళ్ళిపోయాడు.

విగ్రహం మాటల గురించి ఆలోచిస్తూ రోడ్డు పక్కగా అడుగులేస్తుంటే అలవాటైన పేడవాసన ముక్కుకి తగిలి తల తిప్పాడు శ్రీరామ్. గేదెలు రోడ్డంతా ఆక్రమించుకుని తీరిగ్గా నడుస్తున్నాయ్. వాటి మధ్య ఓ ఏనుగులా ఉన్న గేదె మీద యమరాజులా కూచుని ఠీవిగా ప్రయాణిస్తున్నాడు పోలిగాడు. శ్రీరామ్ ఆగాడు. పోలిగాడి వాహనం తన దగ్గరకు రాగానే ''పోలాయ్!'' అని కేకేసాడు.

''ఏటి సంగతి?'' ఛెంగున దూకాడు పోలి. విగ్రహాన్నడిగిన ప్రశ్నే పోలిగాడిని కూడా అడిగాడు.

''నువ్వూ..ఇలా గేదెల్ని మేపుకొచ్చినందుకు మీ అయ్యగారు నీకెంతిస్తారు?''

''ఇయ్యకేం మా బాగా ఇస్తారు! అంతా మా అయ్యే చూసుకుంటాడు. మా అయ్య ఎంతిమ్మంటే అంతా ఇచ్చేస్తారయ్యగారు. ఎయ్యో రెండేలో ఎంతంటే అంత. మా అయ్య మాటకి ఎదురుసెప్తారేటి అయ్ గోరూ?'' జవాబు చెప్పేసి, టుయ్ మని మళ్ళీ వాహనం అధిష్టించాడు పోలిమహారాజు. జవాబు విన్న శ్రీరామ్ గొంతెండిపోయింది. గేదెలన్నీ కనుమరుగయ్యే వరకూ అలాగే నిలబడి మెల్లిగా ముందుకు నడిచి వీధి మలుపు దగ్గర పుల్లమ్మత్త టిఫినీ బండి దగ్గరకొచ్చాడు. పుల్లమ్మత్త కస్టమర్లతో బిజీగా ఉంది. ఎంకటి ఎప్పట్లాగే అంట్లుతోముతోంది. తెచ్చిన చాక్లెట్లు ఆ పిల్ల చేతిలో పెట్టి పక్కనే రాయి

## క్రేజ్

**తెలుగు చిత్రాల్లో నటించి మరిన్ని అవకాశాల్ని పొందుతున్న తారల్లో నయనతారని ప్రముఖంగా చెప్పుకోవచ్చు. కొన్ని చిత్రాలకి దర్శకత్వం చేస్తే మరిన్ని చిత్రాలు తమ ఖాతాలో జమ అవుతాయనుకుంటారు కొంతమంది డైరెక్టర్లు. రణం చిత్రంతో మంచి బేస్ ఉన్న దర్శకునిగా పేరు తెచ్చుకున్న అమ్మ రాజశేఖర్ ఇప్పుడు రవితేజ కొత్త చిత్రానికి దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రణం చిత్రంలోలాగే తన అభిరుచితో ఈ చిత్రాన్ని సక్సెస్ చేయడానికి మరిన్ని అవకాశాల్ని పొందడానికి కృషిచేస్తున్నాడీ దర్శకుడు. నయనతార ఈ చిత్రంలో కథానాయిక.**



మీద కూచుని ''ఎంకటీ! మంచినీళ్ళియ్యవా'' అనడిగాడు. సంబరంగా చాక్లెట్లు చూసుకుంటూ మంచినీళ్లిచ్చింది.

''నీకూ..అంట్లు తోమినందుకు మీ అమ్మ జీత మిస్తుందా?''


''ఛీ మాయమ్మ నాకు జీతమియ్యడమేంది రాంబాబూ? మాయమ్మదంతా నాదే కదా? నా పేర్న మాయమ్మ శానా డబ్బు దాచిపెడతా ఉంటది నెల నెలా. ఈ సారి పండక్కి సెవులక్కమ్మలు చేయిస్తదంట మళ్లీఏడు మెళ్లోకి గొలుసు చేయిస్తదంట. ఆ తరువాత గాజులు మంచి పెళ్లి సమ్మందం కూడా కుదుర్చుకొచ్చింది మాయమ్మ నాకోసం. సేతిలో డబ్బు కూడినాక నాకు పెళ్లి కూడా చేస్తదంట'' చెప్పింది ఎంకటి.

శ్రీరామ్ గంభీరంగా ఆలోచించుకుంటూ లేచి నడక సాగించాడు. ఇల్లు దగ్గర పడ్డాక తమ గేట్లోకెళ్ళకుండా ఎదురుగా ఉన్న మస్తాన్రావు స్కూటర్ రిపేరింగ్ షెడ్లో ప్రవేశించి రంగడి కోసం అటూ ఇటూ చూసాడు. పై రేకులన్నీ ఊడదియ్యబడి అస్తిపంజరాల్లా ఉన్న రెండు స్కూటర్ల మధ్య కనిపించాడు. ''ఏటి చీరాంబాబూ ఇలగొచ్చీసినావ్?'' మొహం నిండా గ్రీజుమరకల్తో పళ్ళికిలించాడు.

''రంగా..రంగా..వరే..'' అంటూ మొదలెట్టి విగ్రహాన్నీ, పోలిగాడినీ, ఎంకటినీ అడిగిన ప్రశ్న రంగడిని కూడా అడిగాడు.

వాడు అందరికంటే పెద్ద సుదీర్ఘమైన జవాబు చెప్పాడు. ''జీతవా? మస్తానా? ఇచ్చినట్టే! ఆడేమిస్తాడో మా మావకే తెలియాల. నన్నీడికి తెచ్చి షెడ్లో పెట్టింది మా మావే కదా. జీతం కూడా మా మావే తీసుకుబోతాడు. ఈ మస్తాను నాకు జీతమియ్యడు కానీ తన్నులు మాత్తరం దండిగా ఇస్తాడు. ఎదవ!'' కచ్చగా తిట్టాడు రంగడు. మళ్ళీ దూరంగా నిలబడి ఎవరితోనో మాట్లాడుతున్న మస్తాను కేసి భయంగా చూస్తూ ''నేనాడిని తిట్టినట్టు ఎవరికీ సెప్పకేం చీరాంబాబూ?'' అన్నాడు. ''చెప్పన్లే'' అంటున్న శ్రీరామ్ మొహం మీద మరిన్ని గంభీరమైన ఆలోచనా మేఘాలు ముసురుకున్నాయి. ఇంటికెళ్ళాక ఆ రాత్రంతా వాడు ఆలోచిస్తూనే ఉన్నాడు.

పొద్దున్నే అలారం గోలకి మేలుకున్న అర్చన, ''శ్రీరామ్! గెటప్ చదువుకోవాలి'' అన్న రొటీన్ డైలాగేస్తూ శ్రీరామ్ గదిలోకి నడిచింది. మంచం ఖాళీ! ఇల్లంతా వెతికింది. ఎక్కడాలేదు! కంగారుగా భర్తని లేపింది. విసుక్కుంటూ లేచిన ఆనంద్ కూడా ఆశ్చర్యపోయాడు. తొమ్మిదవుతున్నా శ్రీరామ్ జాడలేదు. ఏడుస్తూ అర్చన, ఏడుపాపవుకుంటూ ఆనంద్ వీధిలోకొచ్చి ఇరుగు పొరుగు ఇళ్ళల్లో వెతికారు. అందరూ మా ఇంటికి రాలేదంటే మా ఇంటికి రాలేదనే అన్నారు. ఆరోజు ఆదివారమవడంతో అంతా తీరిగ్గా ఉన్నారు. అందరూ వీధిలో నిలబడి శ్రీరామేమయ్యింటాడని చర్చల్లోకి దిగారు. వార్త తెలిసి స్టౌ ఆర్పేసి పుల్లమ్మత్త, వెనకాలే ఎంకటి, గేదెల పని వాయిదా వేసి పోలిగాడు, మస్తాన్రావు తదితర ప్రముఖులందరూ చేరారు. ఇదికాదు పద్ధతి అన్చెప్పి ఒకాయన పోలీసు రిపోర్టిద్దాం పదండని ఆనందుని తీసుకెళ్ళి కంప్లెయింటిప్పించాడు. వాళ్ళూ రంగలోకి దిగారు. గుడికాడ 'ఏసం' కట్టడానికి బయల్దేరిన విగ్రహం జనాన్ని చూసి ''ఓ గంట చేపు ఇక్కడే కలక్షన్ చేసుకుందారి'' అన్న ఆలోచనతో గుంపులో చేరాడు. ''రంగడేడి మస్తానుమామా?'' అడిగాడు పోలిగాడు. ''ఇయ్యాలేటో ఇంకా రాలేదెదవ నాయాల'' అన్నాడు మస్తాను. విగ్రహం పోలిగాడి వెనకచేరి, ''ఆ రంగెదవొట్టి దొంగెదవ సార్. రిపేరింగు నేర్పిత్తాన్జెప్పి చీరాంబాబుని తనెనకాలే తిప్పుకుంటా ఉంటాడు. ఆడ్ని రెండు పీకితే ఆడే జెప్తాడు బాబెటెల్లిందీ ఎవుర్తోటెల్లిందీనూ'' అన్నాడు.



వాడి మాట పూర్తవకముందే రంగడి ఆకారం వీధి మొగలో అవతరించింది. సగం దూరం వచ్చే సరికి అక్కడ చేరిన జనాన్ని గమనించాడు రంగడు. చటుక్కున వెనక్కి తిరిగి పరుగులంకించుకున్నాడు. ''పట్టుకోండెదవని'' అన్న ఖేరింగుల మధ్య విగ్రహం పోలిగాడు బులెట్లలా దూసుకుపోయి పట్టేసారు. లాక్కొచ్చి వీధి కోర్టులో నిలబెట్టారు. పోలీసుల్తో సహా పెద్దలందరూ నిశ్శబ్దంగా ఊపిరిబిగబట్టి చూసారు. ''ఏంత్రా చేతిలో?'' మస్తానడిగాడు. ''న్..న్..న్నీ..క్..క్..కకకోసం ఇడ్లీ''

''ఓహో సెప్పకుండానే పనులు సేసేత్తాన్నావన్న మాట! మరయితే పారిపోతన్నావేత్రా?''

''ఇహిహి..ఊ..ఆ..సెట్నీ పొట్లం మర్చిపోయా! దానికోసం..''

హెడ్డుగారు మౌనంగా లాఠీ పైకెత్తారు.

''అయ్యబాబో! ఒర్నాయనో! ఓలమ్మో!'' కేకలు పెట్టేసే తనెవరో చావ చితగ్గొట్టేసినంత అఘాయిత్యంగా గోలెట్టేస్తూ పుల్లమ్మత్త వెనక నక్కాడు రంగడు.

''దొంగసన్నాసెదవా! ఆ బాబెక్కడున్నాడో సెప్పరా!'' పుల్లమ్మత్త వాడ్ని ముందుకు లాగింది.

''న్..న్..న్నాకేటి తెలుసూ సీరాంబాబెక్కడున్నాడో?'' బ్యారుమన్నాడు.

''మరి బాబనగానే సీరాంబాబేనని ఎలక్కనిపెట్టీసావురా?'' హెడ్డుగారు లాఠీ ఎత్తారు.

''ఒర్నాయనో సంపీకండీ బాబో! సెప్పేత్తాను బాబో! షెడ్డెనకాల సీకటి గదిలో దాంకున్నాడు బాబో!'' అర్చన షెడ్ వెనక్కి ఒక్క పరుగు తీసింది. మరుక్షణం తిరిగొచ్చింది ఏడుస్తూ, ''అక్కడ లేడు'' అంది.

## ఆనందం

**కొంతమంది తారలకి అవకాశాలు వెల్లువలా వచ్చి పడుతుంటాయి. కొత్తదనంతో కూడిన పాత్రలంటే తనకెంతో ఇష్టం అని చెప్పే అందాల భామలు ఎలాంటి అవకాశాలనైనా కాదని అనలేరు. ఇప్పుడు అందాలతార సింధుతులానీ అలాగే అంటోంది. తెలుగులో మరిన్ని అవకాశాలు పొందడానికి ఆమె తెగ తాపత్రయపడుతోంది. అన్నట్టు ఆమె ఇప్పుడు ఎంతో అందంగా తయారవుతోంది. ఆమె అందానికి కారణం ఏంటంటారు?**

''నేనిక్కడున్నాను''

శ్రీరామ్ గొంతు పైనించి వినబడింది. షెడ్డు రేకుల కప్పు మీద ప్రత్యక్షమయ్యాడు శ్రీరామ్.

''అక్కడేం చేస్తున్నావ్ భడవా?'' ఆనంద్ అరిచాడు.

''దిగు''

''దిగను!''

''ఏం? ఎందుకు దిగవు?'' హెడ్డుగారు లాఠీ ఎత్తారు.

''నాకా లాఠీ అంటే భయం లేదు. ఇక్కడికొచ్చి మీ ఇష్టం వచ్చినట్టు కొట్టుకోవచ్చు. స్కూలు బ్యాగు మోసి మోసి నా వీపు బండబారింది లెండి. నన్ను స్కూలు మానిపిస్తానని మా నాన్న మాటిస్తేనే దిగొస్తా''

''ఆహా! స్కూల్ మానేసి ఏం చేద్దామనో తమరు గొడ్లు కాచుకుంటారా?''

''య్యేస్''

''వ్వాట్?''

''య్యేస్''

''ఏం? పోలాయ్ గొడ్లుకాచుకోట్లేదా?''

''బ్యాంక్ మేనేజర్ కొడుకువి గొడ్లు కాచుకుంటావా?'' శంకర్రావంకుల్ అడిగాడు.

''పోనీ పుల్లమ్మత్త టిపినీ బండికాడ సర్వరుద్యోగం చేస్తా''

''నానివ్వను బాబో, ఇంతింత మందికి జీతాలు. నాకు నా కూతురు చాలు'' పుల్లమ్మ పుల్ల విరిచేసింది.

''పోనీ రోములోరి గుడికాడో, సెర్చికాడో నెప్రూా యాసం కట్టి డబ్బులు సంపాదించుకుంటా'' భోరుమంది అర్చన.

''ఛీ..బెగ్గింగ్ రాంగ్ బాబూ తప్పు''

''ఏం? సినిమాలోవాళ్ళు రకరకాల వేషాలు వేస్తే మనం డబ్బులిచ్చి చూడట్లా? వేషం కడితే గొప్ప, యాసం కడితే తప్పానా?''

''తప్పే''

''పోనీ నిర్మలాంటీ ఇంట్లో అంట్లు తోమే ఉద్యోగం చేస్తా''

''నా కడుపు కొట్టకు బాబూ'' దణ్ణం పెట్టింది పదేళ్ళ పనిపిల్ల నర్సి.

''మరయితే మస్తానంకుల్ దగ్గర చేరి రిపేరింగు నేర్చుకుని నా సొంత షెడ్డెట్టుకుంటా''

''నువ్వు చెయ్యలేవు బాబూ ఆ పని. ఆణ్ణేవయినా ముద్దెట్టుకుని ఆడిట్టమొచ్చినట్టు తైతక్కలాణ్ణేచ్చి ఊరికే కూచోబెట్టి జీతమిస్తన్నాననుకుంటున్నావేటి బాబూ? చచ్చేంత పని చేపిస్తా. నాకు తిక్కరేగినప్పుడల్లా ఆడి తప్పు లేకపోయినా ఒక్కటిచ్చుకుంటా. నిన్నటికి నిన్న చూడు బాబూ ఆణ్ణేంత దెబ్బ కొట్టేసానో!'' రంగడి బుర్ర మీది దెబ్బ చూపించాడు మస్తాన్.

''అహ్హహ్హహ్హ'' శ్రీరామ్ వికటాట్టహాసం చేసి దగ్గి, ''అదో దెబ్బా?'' అన్నాడు.

''కాదా?'' పెద్దలు ప్రశ్నించారు.

''పట్టుకోండీ!'' కేక పెట్టి దూకేసాడు శ్రీరామ్. అసంకల్పిత ప్రతీకారచర్యగా వాడిని పట్టుకుని, జాగ్రత్తగా దింపి, పిల్లాడి దూకుడుతనానికి అదిరిపోయారు పెద్దలు. వాడు దూరంగా నాలుగడుగులు వేసి నిలబడి రంగడికి చూపుడు వేలితో సైగ చేసాడు. రంగడు దగ్గరకెళ్ళి శ్రీరామ్ షర్టు గుండీలు విప్పాడు. శ్రీరామ్ వెనక్కి తిరిగాడు. ఒక మహాకళాఖండాన్ని ఆవిష్కరిస్తున్నంత గొప్పగా మొహం పెట్టి నెమ్మదిగా షర్టులాగాడు రంగడు.

''ఆ!!'' అందరూ ఒక్కసారి విస్తుపోయి అరిచారు. శ్రీరామ్ వీపంతా ఎర్రగా, మధ్యలో అక్కడక్కడా నల్లనల్లగా కమిలిపోయి ఉంది.

''ఏవిట్రా ఎవరు కొట్టార్రా?'' అర్చనా ఆనంద్ శ్రీరామ్ దగ్గరికి పరుగుపెట్టారు. సర్రున ఇటు తిరిగి ''ఆగండక్కడే!'' అరిచాడు శ్రీరామ్. ఇద్దరూ ఆగారు.

''రోజూ పదిహేను కేజీల పుస్తకాల సంచీ మోసి మోసి నా వీపలా అయిపోయింది ఎవరూ కొట్టకుండానే. రంగడిని మస్తానంకుల్ కొట్టే దెబ్బలొక లెక్కా?'' చేతులు కట్టుకు నిలబడి ఠీవిగా ప్రశ్నించాడు.

''ఆ గాడిద బరువు కాక క్లాసులో అందర్లోకీ కాస్త బాగా చదువుతానని చెప్పి స్కూల్ డే వచ్చినా ఇన్స్పెక్టరొచ్చినా ఏవొచ్చినా నాకే ఇంకాస్త ఎక్స్ట్రా వర్క్ ఇస్తారు. అంత వర్కు చేయిస్తారుగానీ పైసా ఇవ్వరు. స్కూల్లో నా బతుకలా ఏడిస్తే ఇంటికొస్తే చాలు చదువు చదువు బాగా చదువు బాగా చదవాలి అమెరికా వెళ్ళాలి అని మీ గోలొకటి. ఏం మీరే చదువుకుని మీరే వెళ్లచ్చుగా ఆ అమెరికా? నేనింక చదువు మానేస్తా. రంగడు, ఎంకటి, పోలి, నర్సి, గాంధీ. వీళ్ళందరి లాగే ఏదో ఓ ఉద్యోగం చేసుకు హాయిగా బతుకుతా.''

''మేం మీ స్కూలు వాళ్ళతో మాట్లాడతాం. అతిగా హోం వర్క్ ఇవ్వద్దనీ, పిల్లలకి ఇంటరెస్ట్ లేని ప్రాజెక్ట్‌వర్కులు కూడా ఇవ్వద్దని నచ్చజెప్తాం. నీకేం కష్టం కలక్కుండా చూస్తాం. ప్రామిస్'' అర్చన, ఆనంద్ ఏకకంఠంతో పలికారు.

శ్రీరామ్ గోడపక్కనున్న స్క్రాప్ కుప్పెక్కి దాని మీంచి షెడ్డు టాపుమీదకి ఎగబాకి ఎక్కి కూచున్నాడు. ''చదువుకున్న పెద్దవాళ్ళకి ఈ దేశంలో ఉద్యోగాలు దొరకట్లేదని మా టీచర్లు చెప్తుంటారు. నేను చూస్తున్నాగా చదువుకోకపోయినా చిన్నవాళ్ళకి బోలెడుద్యోగాలు దొరుకుతాయ్. జీతాలొస్తాయ్. నన్ను చదువు మానిపించాలి. ఉద్యోగంలో చేర్పించాలి. ఎప్పుడూ ఆ పౌష్టికాహారం కాకుండా మామూలు ఇడ్లీలూ, దోసెలూ, గారెలు అన్నీ పెట్టాలి. వారానికోసారి బంగాళదుంపల వేపుడు చెయ్యాలి. అలా ప్రామిస్ చేస్తే దిగుతా'' చెప్పదల్చుకున్నది చెప్పేసి మౌనంగా కూచుండిపోయాడు.

తలెత్తి ఎత్తుగా కూచునున్న ఆ బాలరాముడిని అచ్చెరువున కళ్ళు విప్పార్చి చూస్తున్న ఆనంద్ ''ఎంత ఎదిగిపోయావురా? కళ్ళు తెరిపించావ్!'' అన్నాడు ఆనంద్ గుండెలోని ఆర్ద్రత ఆనందబాష్పాలై పొంగింది.

''మరయితే కుర్రాడ్ని స్కూలు మానిపించేస్తారా ఏవిటీ?'' కంగారుగా అడిగాడు వెంకట్రావంకుల్.

''అది కాదు అసలు విషయం''

''మరేమిటో?'' పెద్దలందరూ ఒక్క గొంతుతో ప్రశ్నించారు.

''మన వీధిలో ఇంతమంది నిరుపేద బాలకార్మికులున్నారు. వీధినిండా ఇందరం పెద్దలం ఉన్నాం. రోజూ అందరం వాళ్ళని చూస్తూనే ఉన్నాం. అయినా మనలో ఒక్కరికూడా ఆ పిల్లల దురవస్థపట్ల స్పందన కలగలేదు. వాళ్ళకే సహాయమూ అందించలేదు. పౌరులుగా మన బాధ్యత మనం పూర్తిగా విస్మరించాం'' అన్నాడు ఆనంద్.

''నిజమే ఆనంద్. మీరు చెప్పింది నిజం. ఇవాళే మనం మన వీధి బాలకార్మికుల రీహాబిలిటేషన్ కోసం మంచి పథకం తయారు చేద్దాం'' అన్నాడు శంకర్రావంకుల్.

''ఇంక దిగవయ్యా తిరగబడ్డ శ్రీరామా! నీ సమస్యతోబాటు నీ సాటి పిల్లల బాధలు కూడా మాకు తెలిసొచ్చేలా చేసావు. మొత్తానికి మా ఆలోచనల్లో కూడా విప్లవం సృష్టించేసావు. ఇంక దిగు'' శంకర్రావంకుల్ మాటలకి నవ్వుకుంటూ అర్చన, ఆనంద్ జాపిన చేతుల్లోకి హనుమంతుడిలా దూకేసాడు మన చిచ్చరపిడుగు రాముడు.

*

